ప్రజాశక్తి
బుధవారం 17 మే 2023 5 అనంతపురం

కలెక్టరేట్ వద్ద చిప్పచేతపట్టుకుని నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

నత్తనడకన పంచాయతీరాజ్ పనులు

◆ 23 శాతం పనులు ఆరంభానికి నోచుకోని వైనం

◆ ఎక్కడికక్కడే ఆగిన బల్క్ కూలింగ్, డిజిటల్ లైబ్రరీలు

◆ రైతు భరోసా కేంద్రాల పరిస్థితి అదే

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో కీలకంగా వ్యవహరించేది పంచాయతీరాజ్ శాఖ. రహదారులు మొదలుకుని అనేక రకాలైన ప్రభుత్వ భవనాల నిర్మాణం వంటి పనులను ఈ శాఖనే పర్యవేక్షిస్తుంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ శాఖ పరిధిలో జరుగుతున్న పనులు నత్తనడకనే సాగుతున్నాయి. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు సైతం ముందుకు నడవటం లేదు.

ఆరంభానికే నోచుకోని 23 శాతం పనులు

అనంతపురం జిల్లా పరిధిల్లో స్పీల్ వర్క్స్ అంటే 2022-23 ఆర్థిక సంవత్సరం కంటే ముందు మిగులున్న పనులు 3686 ఉన్నాయి. వీటికి అదనంగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో 73 పనులు మంజూరయ్యాయి. మొత్తం కలిపి 3759 పనులు గత ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముందున్నాయి. వీటిల్లో ఇప్పటి వరకు పూర్తయిన పనులు చూస్తే 1191 మాత్రమే పూర్తయ్యాయి. అంటే మొత్తంగా 31 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. తక్కిన వాటిల్లో 1684 పనులు ఇంకా పురోగతిలోనున్నాయి. ఇక పూర్తిగా ప్రారంభానికి నోచుకోనివి 884 పనులున్నాయి. అంటే 23 శాతం పనులకు ఇంకా పునాదిరాయి కూడా పడలేదు.

ప్రతిష్టాత్మక పనులు సైతం...

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పథకాలకు సంబంధించిన పనులు సైతం నత్తనడకనే సాగుతున్నాయి. జగనన్న పాల వెల్లువ కార్యాక్రమంలో కీలకమైన బల్క్‌మిల్క్ కలెక్షన్ కేంద్రాల నిర్మాణం జిల్లాలో 125 చేపట్టాలన్నది లక్ష్యంకాగా ఇప్పటి వరకు పూర్తయింది నాలుగు మాత్రమే. 13 కేంద్రాలు పురోగతిలోనున్నాయి. తక్కిన 108 కేంద్రాల నిర్మాణం ఆరంభానికే నోచుకోలేదు. అదే విధంగా డిజిటల్ లైబ్రరీల నిర్మాణం 136కు నిర్మాణం చేపట్టాలన్నది లక్ష్యం. ఇప్పటి వరకు కట్టింది కేవలం ఒక్కటి మాత్రమే. ఏడు పురోగతిలోనున్నాయి. తక్కిన 178 కేంద్రాల ఆరంభానికి నోచుకోలేదు. సిసి రహదారులు 1827 మంజూరవగా 511 పనులు ప్రారంభమే అవలేదు. రైతు భరోసా కేంద్రాల పరిస్థితి ఇదే రకంగా ఉంది. జిల్లాకు 411 కేంద్రాలు మంజూరయితే 139 మాత్రమే పూర్తయ్యాయి. 182 పురోగతిలోనున్నాయి. తక్కిన రెండు కేంద్రాలు ఆరంభమే కాలేదు. వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్‌లు 326కుగానూ 139 మాత్రమే పూర్తయ్యాయి. గ్రామ సచివాలయాలు 469లకుగానూ 301 పూర్తయ్యాయి. తక్కినవి పెండింగులోనున్నాయి.

రూ.63.08 కోట్లు బకాయిలు

పైన పేర్కొన్న పనులన్నీ కలిపి రూ.356.71 కోట్లు పనులు జరిగాయి. ఇందులో రూ.293.63 కోట్లు చెల్లింపులు జరిగాయి. తక్కిన 63.08 కోట్లు బకాయిలున్నాయి. ఇందులో గ్రామ సచివాలయాలకు సంబంధించి రూ.11.64 కోట్లు ఉన్నాయి. సిసి రోడ్లకు సంబంధించి రూ.19.76 కోట్లు, రైతు భరోసా కేంద్రాలకు సంబంధించిన బిల్లులు రూ.9.68 కోట్లు, ఎఎంసి రోడ్ల బిల్లులు రూ.8.05 కోట్లు ఇలా అన్ని రకాల పనులకు సంబంధించి రూ.63.08 కోట్లు బకాయిలున్నాయి. ఈ బకాయిలు చెల్లింపులో నిర్లక్ష్యం కారణంగా పనుల్లో వేగం తగ్గినట్లు కన్పిస్తోంది.

ఆటో కార్మికులపై...

పోలీసుల వేధింపులు ఆపాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఆటో కార్మికులపై అపరాధ రుసుం విధింపుల పేరుతో పోలీసులు చేస్తున్న వేధింపులు ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భగత్‌సింగ్ ఆటో కార్మికుల యూనియన్, సిఐటియు సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నాడు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ముందుగా ఆర్ట్స్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ఆటో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ గేటు వద్ద మండుటెండలో రోడ్డుపై బైటాయించి ఆందోళన చేపట్టారు. పోలీసులు వేధింపులు కొనసాగితే ఆటో కార్మికులు రోడ్లపై చిప్పపట్టుకుని అడుక్కునే దుస్థితి ఏర్పడుతుందంటూ చిప్పలు పట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ సహాయం లేకుండా గత కొన్ని సంవత్సరాలుగా అనంతపురం నగరంలో ఆటోలు నడుపుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. 2019 కరోనా మొదలైనప్పటి నుంచి ఆటో డ్రైవర్‌లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వాహన మిత్ర పేరుతో కొద్ది మందికి మాత్రమే రూ. 10 వేలు ఇచ్చి సంవత్సరానికి ఈ చలానా రూపంతో వేల రూపాయలు ఆటో కార్మికుల నుంచి పోలీసులు బలవంతంగా లాక్కుంటున్నారని తెలిపారు. పోలీసులు ఇ-చలానాల పేరుతో ఇప్పుడు కొత్తగా పెట్టి 290 కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జరిమానాల రూపంలో వేల రూపాయలు వేస్తూ కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. నగరంలో పార్కింగ్ స్థలాలలో నిలిపిన ఆటోలకు కూడా ఆటో డ్రైవర్లతో సెల్‌ఫోన్‌లు లాక్కొని, పోలీసు స్టేషన్‌కు రమ్మని దురుసుగా ప్రవర్తిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇలాంటి చర్యలు సరికావన్నారు. ఇప్పటికైనా జిల్లా పోలీస్ అధికార యంత్రాంగం ఇ-చలానాలు రద్దు చేయకపోతే జిల్లా వ్యాప్త ఉద్యమాన్ని చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం డిఆర్ఒ బి.గాయత్రిదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శులు ముత్తుజ, వెంకటనారాయణ, భగత్ సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఎన్టీఆర్ శ్రీనివాసులు, శివప్రసాద్, నాగరాజు, ఆదినారాయణ, ఆజాం, గఫూర్, ఇర్ఫాన్, నాగేంద్ర, శ్రీనివాసులు, ముత్తుజ ఆటో కార్మికులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి వీరబ్బాయి

డెంగీ నివారణకు కృషి

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వీరబ్బాయి

ప్రజాశక్తి-అనంతపురం

డెంగీ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వీరబ్బాయి పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అధ్యక్షతన జిల్లా మలేరియా అధికారి అధ్వర్యంలో మంగళవారం నగరంలోని మున్సిపల్ సమావేశ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల వల్లనే డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, బోధ వ్యాధి, మెదడువాపు వ్యాధులు వస్తాయన్నారు. కావున దోమల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతానా ఉందన్నారు. సహాయ మలేరియా అధికారి కె.సత్యనారాయణ దోమల నివారణ చర్యల గురించి వివరించారు. పరిసరాలు,కాలువలు శుభ్రంగా ఉంచాలని మునిసిపల్ శాఖల అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మలేరియా అధికారి ఓబులు, జిల్లా మలేరియా కార్యాలయం సిబ్బంది ఎఎంఒ సత్యనారాయణ, ఎంపిహెచ్ఇఒలు గిరిధర్‌రెడ్డి, మద్దయ్య, సూపర్‌వైజర్లు నూర్‌బాషా, శేఖర్, మున్సిపల్ కమిషనర్, ప్రాజెక్టు డైరెక్టర్, మున్సిపల్ ప్రజారోగ్య అధికారి, అసిస్టెంట్ మలేరియా అధికారి, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, వార్డ్ ఆరోగ్య కార్యదర్శులు వార్డ్ శానిటేషన్ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు ఇవ్వకుంటే పనులెలా చేయాలి..?

కార్పొరేషన్ అధికారులను ప్రశ్నించిన కాంట్రాక్టర్లు

సమావేశంలో మాట్లాడుతున్న కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

'కాంట్రాక్టర్లు కోట్లాది రూపాయలను ఖర్చు చేసి పనులను చేస్తున్నారు.. వాటికి సంబంధించి బిల్లుల చెల్లింపులో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఏ ధైర్యంతో కొంతపనులు చేయాలి' అంటూ కాంట్రాక్టర్లు అనంత కార్పొరేషన్ అధికారులను ప్రశ్నించారు. మంగళవారం ఉదయం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ రమణారెడ్డి ఆధ్వర్యంలో కాంట్రాక్టర్లతో సమావశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సోమవారం నాడు నగర అభివృద్ధిపై కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగిందన్నారు. ఈ సమావేశంలో కాంట్రాక్టర్లపై నమ్మకంతో అభివద్ధి పనులు జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చామన్నారు. పనులను తీసుకున్న కాంట్రాక్టర్లు త్వరితగతిన వాటిని పూర్తి చేయాలన్నారు. దీనిపై కాంట్రాక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ గతంలో జగనన్న లేఅవుట్లకు సంబంధించి గత కలెక్టర్ స్వయంగా జారీ చేయగా రూ.50 లక్షల పనులు చేశామన్నారు. రెండేళ్లు కావస్తున్నా వాటికి సంబంధించిన బిల్లులు మంజూరు కాలేదన్నారు. బదిలీపై వెళ్తున్న సందర్భంలో ఆ కలెక్టర్‌ను బిల్లుల విషయమై సంప్రదిస్తే తనకేం సంబంధం లేదని, తాను బదిలీపై వెళ్తున్నానని సమాధానం ఇచ్చారన్నారు. అధికారులు పనులు పూర్తి చేయించడానికి ఒక మాట, బిల్లులు చెల్లించే సమయంలో మరోమాట చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గడపగడపకూ మన ప్రభుత్వం కింద రూ.13.5 కోట్లకు టెండర్లు పిలిచారని, ఇందులో రూ.6.15 కోట్లకు మాత్రమే పరిపాలన అనుమతి తీసుకున్నారని చెప్పారు. మిగిలిన రూ.7కోట్లు దేని పరిధిలోకి వస్తాయన్న దానిపై స్పష్టత లేదన్నారు. గ్రాంట్ పనులా, లేక జనరల్ ఫండ్ అన్నా అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వాలన్నారు. స్పష్టత ఇవ్వకుండా పనులు చేపడితే కాంట్రాక్టర్లు పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికే తాము చేసిన పనులకు బిల్లులు రాక అవస్థలు పడుతున్నామన్నారు. నగరంలో ఇటీవలి కాలంలో వరదలు వచ్చి ముంపునకు గురైన ప్రాంతాల్లో మానవతా దక్పథంతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు రాలేదన్నారు. వాటి గురించి పట్టించుకునే నాథుడేలేరని ఆవేదన వ్యక్తం చేశారు. సాక్షాత్తు కమిషనర్ భాగ్యలక్ష్మి చెప్పిన పనులు చేసిన వాటికి కూడా బిల్లులు రాని పరిస్థితి ఉందన్నారు. బిల్లులు రాని ఇలాంటి పరిస్థితుల్లో అభివద్ధి పనులు ఎలా చేపట్టాలని ప్రశ్నించారు. పెండింగ్ బిల్లులు అన్నింటినీ తక్షణం కాంట్రాక్టర్లకు చెల్లించాలని డిమాండ్ చేశారు. బిల్లుల చెల్లింపులో అధికారులు, శాఖల మధ్య సమన్వయలోపం ఉందని, దానిని తక్షనం పరిష్కరించాలన్నారు. లేకుంటే కాంట్రాక్టర్లు ఏపనులు చేయడానికి కూడా ముందుకు రారన్నారు. దీనిపై కమిషనర్ రమణారెడ్డి స్పందిస్తూ బిల్లుల చెల్లింపు విషయమై స్వయంగా ఆయా శాఖల అధికారులతో మాట్లాడతానిని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ సతీష్‌చంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామ్మోహన్ రెడ్డి, ఇన్‌ఛార్జి ఈఈ చంద్రశేఖర్, డిఈలు రాంప్రసాద్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్లు బాబావలి, శంకర్ దాస్, రామ్మోహన్, కాంట్రాక్టర్లు వేణుగోపాల్ రెడ్డి రత్నయ్య, నులక వెంకటేష్, ప్రభాకర్ రావు, రఘునాథరెడ్డి, సుధాకర్, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌స్పెషాల్టీ ఆసుపత్రి అభివృద్ధి సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే..

పేదలకు 'సూపర్ స్పెషాలిటీ' సేవలు

ఆసుపత్రి అభివృద్ధి సమావేశంలో కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అత్యాధునిక వసతులు కలిగిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్య సేవలు పేద ప్రజలకు మరింతగా చేరువ చేసి అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఎం.గౌతమి వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అభివృద్ధి సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత సేవలు ఎక్కువగా అందించగలిగితే ఆసుపత్రి ఆదాయం పెరుగుతుందని, తద్వారా సొంతంగా ఆసుపత్రి అభివద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉంటుందన్నారు. గర్భిణులకు ఉచిత ప్రసవాల సంఖ్య పెంచే అవకాశం ఉందన్నారు. ఆసుపత్రిలో స్పెషలిస్టు వైద్యులను పూర్తిస్థాయిలో నియమించుకోవడంపై దష్టి సారించాలన్నారు. ఆసుపత్రి అభివద్ధి కోసం నిధుల సమీకరణ విషయంలో తన స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఎంపీల్యాడ్స్ నిధులు, సీఎస్సార్ నిధుల కేటాయింపులు కోరుతూ ప్రతిపాదనలు పంపుతానన్నారు. ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, సర్వజన ఆసుపత్రులకు వేర్వేరుగా బడ్జెట్ కేటాయించేందుకు అడ్డుగా ఉన్న సాంకేతిక సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. వైద్యసేవలను మరింత విస్తృతం చేసి పేద ప్రజలకు వైద్యసేవలను అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో జెనరిక్ మందుల షాపు ఏర్పాటు, క్యాజువాలిటీ విస్తరణ, ఫోరెన్సిక్ ల్యాబ్‌కు 2 ఫ్రీజర్ల మంజూరు, కోవిడ్ ఓపీకి ఆక్సిజన్ పైప్‌లైను, మెకానికల్ లాండ్రీ షాపు ఏర్పాటు చేసేందుకు కమిటీ ఆమోదం తెలిపింది. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ రఘునందన్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఇన్‌ఛార్జి సుబ్రమణ్యం, డిఎంహెచ్ఒ వీరబ్బాయి, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ మునిచంద్రారెడ్డి, డీసీహెచ్ఎస్ కృష్ణవేణి, ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి, నార్పల సత్యనారాయణ రెడ్డి, రచయిత తరిమెల అమర్నాథ్ రెడ్డితో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

తాగునీటి సమస్య పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

నియోజకర్గంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించడంలో అటు ప్రభుత్వం, ఇటు అధికారులు పూర్తిగా విఫలమయ్యారని సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ విమర్శించారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజకర్గంలోని 104 గ్రామాలతోపాటు ఉరవకొండ, రాప్తాడు నియోజకవర్గాలకు తాగునీరు అందించే సత్యసాయి ప్రాజెక్టు మోటార్లు చెడిపోయి దాదాపు 20 రోజులు కావస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడన్నారు. దీంతో ఆయా గ్రామాల్లో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ఈ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహిస్తున్న ఉషశ్రీచరణ్ మంత్రిగా కొనసాగుతున్నా ప్రజలకు ఈ దుస్థితి ఏంటని నిలదీశారు. తాగునీటి సమస్యను పరిష్కరించాల్సి నాయకులు కొంతమంది సత్యసాయి కార్మికులు సమ్మె చేస్తుండటంతో తాగునీటి సమస్య నెలకొందని చెప్పడం సిగ్గుచేటన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయి అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించడంతోపాటు తాగునీటి ఎద్దడిని నివారించాలని, లేనిపక్షంలో తమతో కలిసొచ్చే రాజకీయ పార్టీలతో కలిసి సిపిఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు

బదిలీలు, ప్రమోషన్ల షెడ్యూల్ విడుదల చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్ల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ బదిలీలు, ప్రమోషన్ల షెడ్యూల్‌ను విడుదల చేయాలన్నారు. దాదాపు సంవత్సర కాలం నుంచి బదిలీలు ప్రమోషన్లు షెడ్యూల్‌ను వేసవి సెలవుల్లో ప్రకటిస్తామని చెప్పి ఇప్పటి వరకు ఎలాంటి షెడ్యూల్ ఇవ్వలేదన్నారు. కాగా ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరుతో ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను 1, 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో కలపడం ద్వారా అనేక మంది బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాతృభాష విద్యా విధానాన్ని తొలగించి సరైన సౌకర్యాలు, ఉపాధ్యాయులను నియమించకనే సిబిఎస్ విధానాన్ని ప్రవేశ పెట్టడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురై డ్రాప్ అవుట్‌గా మిగిలిపోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లింగమయ్య, ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు, జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు రామప్ప చౌదరి, కోశాధికారి రాఘవేంద్ర, కార్యదర్శులు అర్జున్, హనుమంతురెడ్డి, రాముడు, రాష్ట్ర కౌన్సిలర్ ఈశ్వరయ్య, సూర్యనారాయణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బారాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప

ఆర్ఐఒను సస్పెండ్ చేయాలి

ముందస్తు అడ్మిషన్లను నియంత్రించాలి - విద్యార్థి నేతల అర్ధనగ్న ప్రదర్శన

అర్ధనగ్న ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కాసులకు కక్కుర్తిపడి ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల వ్యాపారానికి సహకరిస్తున్న ఆర్ఐఒ సురేష్‌బాబును వెంటనే సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ముందస్తు అడ్మిషన్లు, పుస్తకాల విక్రయం, తరగతులు నిర్వహిస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నగరంలోని ఆర్ఐఒ కార్యాలయం ఎదుట అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కుళ్లాయిస్వామి, ఎఐఎస్‌బి జిల్లా కార్యదర్శి పథ్వీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి సురేష్ యాదవ్, ఎఐఎస్ఎ నాయకులు పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ నగరంలోని కొన్ని ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తూ తల్లిదండ్రుల నుంచి రూ.వేలు దండుకుంటున్నాయని ఆరోపించారు. అలాగే ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఎస్ఆర్ విద్యా సంస్థ ముందస్తు అడ్మిషన్లు, తరగతులు నిర్వహిస్తోందన్నారు. అంతేగాకుండా ఆ సంస్థకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. ఆధారాలతో సహా ఆర్ఐఓకు ఫిర్యాదు చేస్తే కేవలం నోటీసులకు మాత్రమే పరిమితమయ్యారని విమర్శించారు. దీంతోపాటు మరిన్ని విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్నా ఆర్ఐఓ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ముడుపులు తీసుకోవడం వల్లే ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే ఆర్ఐఓను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్ర, రాజేష్, ముస్తఫా, ఎఐఎస్ఎఫ్ నాయకులు ఉమామహేష్, ఆనంద్, విష్ణు, జగదీష్, ఏఐఎస్‌బి నాయకులు మారుతి, నరేష్, అజయ్, నాగార్జున, బిని, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సమైక్య నాయకులు చంద్ర సాయి, ఎఐఎస్ఎ నాయకులు నితీష్ తదితరులు పాల్గొన్నారు.

- ప్రజాశక్తి వార్తకు స్పందన -

సచివాలయాలను తనిఖీ చేసిన ఎంపిపి, జెడ్పీటీసీ

ప్రజాశక్తి-ఉరవకొండ

సచివాలయాల్లో పని చేస్తున్న విఆర్ఓలతోపాటు సిబ్బంది సక్రమంగా విధులు హాజరుకావాలని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జెడ్పిటిసి హనుమంతు సూచించారు. అందుబాటులో లేని విఆర్ఓలు.. ఇబ్బందుల్లో ప్రజలు అన్న శీర్షికతో సోమవారం ప్రజాశక్తి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి ఎంపిపి స్పందించారు. ఇందులో భాగంగా మంగళవారం మండల పరిధిలోని పాల్తూరు 1, 2వ సచివాలయాలను ఎంపిపి, జడ్పీటిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సేవలు అందించాలన్న ఉద్దేశంతోనే సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిందన్నారు. అలాంటి సచివాలయాలకు కొంతమంది సిబ్బంది వల్ల చెడ్డపేరు వస్తోందన్నారు. సక్రమంగా విధులకు హాజరుకాని విఆర్ఓలపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే తహశీల్దార్, ఆర్‌డిఒల దృష్టికి తీసుకెళ్లామన్నారు. సచివాలయ సిబ్బంది కూడా సమయపాలన పాటించి విధిగా విధులకు హాజరుకావాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బ్యులా రాణి రాజశేఖర్, ఎంపిటిసిలు దాసరి లక్ష్మి, పాటిల్ దివ్యశ్రీ, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, షణ్ముఖగౌడ్, రాజశేఖర్, వెంకటేశులు, శివ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు

అధిక రక్తపోటుపై అవగాహన అవసరం

కార్డియాలజిస్ట్ మూడే సందీప్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అధిక రక్తపోటుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అనంతపురం కిమ్స్ సవీర ఆసుపత్రి సీనియర్ కన్సల్‌టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మూడేసందీప్ సూచించారు. బుధవారం ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రజాశక్తితో మాట్లాడుతూ ధూమపానం, మద్యం ఎక్కువగా తీసుకోవడం, అధిక బరువు ఉండటం (ఊబకాయం), శారీరక శ్రమ లేకపోవడం, ఆహారంలో ఉప్పు ఎక్కువగా తీసుకోవడం, మానసిక ఒత్తిడి అధిక రక్తపోటు కుటుంబ నేపథ్యం, దీర్ఘకాల మూత్రపిండాల వ్యాధి, థైరాయిడ్ సమస్యల కారణంగా గుండెపోటు వచ్చే అవకాశం ఉందన్నారు. అధిక రక్తపోటు మెదడుపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఒక్కోసారి మెదడులోని రక్తనాళాలు చిట్లిపోయి ప్రాణం పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కావున రక్తపోటుపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా రోజూ తీసుకునే ఆహారంలో ఉప్పు తక్కువ ఉండేలా చూసుకోవాలని, కొవ్వు పదార్థాలను పరిమితి మించకుండా తీసుకోవాలని, వ్యాయామం చేయాలని, మద్యం తాగే అలవాటు ఉంటే మోతాదు మించకుండా చూసుకోవాలని, ఎప్పటికప్పుడు రక్తపోటును ఎప్పటికప్పుడు పరీక్షించుకుంటూ ఉండాలని సూచించారు.

రెజ్లర్లను వేధించిన బిజెపి ఎంపీని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-గుంతకల్లు

మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురి చేసిన ఆల్ ఇండియా రెజ్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు మహిళా రెజ్లర్ల ఆందోళనలకు మద్దతుగా ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని సీపీఐ ఎం ఎల్ న్యూ డెమోక్రసీ కార్యాలయం వద్ద నుంచి పొట్టి శ్రీరాములు కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేధింపులకు గురైనట్లు మహిళా రెజ్లర్లు ఆందోళన వ్యక్తం చేస్తూ నిరసన తెలుపుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వెంటనే బిజెపి ఎంపిని అరెస్టు చేయడంతోపాటు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు డివిజన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు,చిన్నా , ప్రగశీల మహిళా సంఘం (పిఒడబ్ల్యు) నియోజకవర్గ కార్యదర్శి ఆశాబీ, పట్టణ కార్యదర్శి మాబూనీ, కమిటీ సభ్యులు బాషా, వీరేంద్ర, గోపీ, జానయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న ఐఎఫ్‌టియు నాయకులు, ప్రజలు

నాడు-నేడు పనులను త్వరగా పూర్తి చేయండి

ప్రధానోపాధ్యాయుల సమీక్షలో కమిషనర్ రమణారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరపాలక సంస్థ పరిధిలోని మున్సిపల్ పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనులను వేగవంతంగా పూర్తయేలా ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలని కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. మంగళవారం కార్పొరేషన్‌లోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ఫేస్-2 భాగంలో చేపట్టిన నాడు-నేడు పనుల పురోగతిపై అప్పర్ ప్రైమరీ, ఎలిమెంటరీ, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు నేడు పురోగతిపై జిల్లా అధికారులు రోజూ సమీక్షలు నిర్వహిస్తున్నారని, పనుల కోసం మంజూరు చేసిన నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిర్మాణ పనులు, మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత ఆమెనిటీస్ కార్యదర్శులు, నగరపాలక ఉన్నతాధికారులను సంప్రదించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంజినీర్ సతీష్‌చంద్ర, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రమణారెడ్డి

వివాహానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని తరిమెల గ్రామానికి చెందిన చిత్రచేడు లక్ష్మీదేవి, నరసింహుడు కుమారుడు నాగార్జున వివాహానికి జడ్పీటిసి కంచిరెడ్డి సుధా, భాస్కర్‌రెడ్డి దంపతులు మంగళవారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల వివాహాలకు ఆర్థికసాయం అందించడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కంచిరెడ్డి కోటేశ్వర్‌రెడ్డి, కొండారెడ్డి, అమర్నాథ్, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న జడ్పీటిసి కంచిరెడ్డి సుధా, భాస్కర్‌రెడ్డి

యాగానికి కాశీ జగద్గురు రాజశ్యామలకు ఆహ్వానం

ప్రజాశక్తి-ఉరవకొండ

ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అష్టోత్తర(108) కుండాత్మక, చండి, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహా యజ్ఞం కార్యక్రమానికి హాజరుకావాలని శ్రీకాశీ జగద్గురువును ఆల్ ఇండియా వీరశైవ లింగాయత్ మహాసభ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షులు దండిన శివానంద మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పిలుపుమేరకు భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణార్థం సర్వతోముఖాభివద్ధి సమస్త రాష్ట్ర ప్రజల శాంతి సౌభాగ్యాల కోసం,పాడిపంటల సమద్ధి,ప్రకతి మాత అనుగ్రహం కొరకు చేపట్టిన యాగం ఈనెల 12వ తేదీ నుంచి 17వ తేదీ వరకు విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి హాజరుకావాలని శ్రీ కాశీ జగద్గురువును శాలువా కప్పి ఆహ్వాన పత్రికను అందించి ఆహ్వానించారు.అనంతరం శ్రీ కాశీ జగద్గురువు దండిన శివానందను వీర శైవ లింగాయత్ మహాసభ ద్వారా వీరశైవుల అభివద్ధికి అన్ని విధాలుగా కషి చేయాలని, సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఆశీర్వదించారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం

ఖరీఫ్ సాగుకు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని కలెక్టర్ గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక రెవెన్యూ భవన్‌లో వ్యవసాయ, అనుబంధ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈఏడాదిని రాష్ట్ర ప్రభుత్వం మిల్లెట్స్ అఫ్ ఇయర్‌గా నిర్వహిస్తున్న నేపథ్యంలో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు కలిసి చిరు ధాన్యాల సాగు విస్తీర్ణం పెంచేందుకు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే వైఎస్ఆర్ రైతు భరోసా, సున్నా వడ్డీ, పంట రుణాలు, పంటల బీమా, యంత్ర సేవాపథకం, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇతర పథకాలను రైతులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన అధికారులు పక్కాగా ఈ-పంట నమోదు చేయాలన్నారు. అదేవిధంగా అకాల వర్షాలకు నష్టపోయిన పంటలను గుర్తించి ప్రభుత్వానికి పక్కాగా నివేదిక అందించాలన్నారు. రైతు భరోసా కేంద్రాల భవనాలను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రైతు ఆత్మహత్యలు జరగకుండా పక్కా ప్రణాళికతో ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేస్తూ అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచే విధంగా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ కేతన్‌గార్గ్, జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్, జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

అదనంగా ఏడు పీజీ సీట్లు మంజూరు

అనంత వైద్య కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి

ప్రజాశక్తి-అనంతపురం

2023-24వ సంవత్సరానికి అనంత వైద్య కళాశాల మైక్రోబయాలజీ విభాగానికి జాతీయ వైద్య మండలి (నేషనల్ మెడికల్ కమిషన్) అదనంగా మరో ఏడు పోస్టు గ్రాడ్యుయేట్ సీట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రిన్సిపల్ ఆరేపల్లి శ్రీదేవి తెలిపారు. ఈమేరకు అదనపు సీట్లు మంజూరు కావడం పట్ల మైక్రో బయాలజీ సిబ్బంది మంగళవారం మెడికల్ కళాశాలలోని ప్రిన్సిపల్ ఛాంబర్‌లో ప్రిన్సిపల్ శ్రీదేవిని కలిసి బొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రస్తుతం ఏడు సీట్లు పెరగడంతో మొత్తం 11 పీజీ సీట్లు అవుతాయన్నారు. ఇన్ని పీజీ సీట్లు రావడంలో మైక్రోబయాలజీ విభాగాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసిన బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది, విఆర్‌డిఎల్, ఎస్ఆర్ఎల్, వైరల్ లోడ్ సెంటర్, సిడి4, ఐసీటీసీ, పిపిటిసిటి, వైరల్ హెపటైటిస్ శాఖల సమన్వయ కృషి ఫలితమే అన్నారు. మైక్రో బయాలజీ సహాయ విభాగాధిపతి ఆర్.హైమావతి మాట్లాడుతూ రాష్ట్రంలో స్విమ్స్ ఆసుపత్రి తర్వాత కోవిడ్ పరీక్షలు నిర్వహించిన మొట్టమొదటి వైద్య కళాశాల అనంతపురం అన్నారు. అలాగే రాయలసీమ జిల్లాల్లో హెచ్ఐవి వైరల్ లోడ్ శాతాన్ని నిర్ధారించే పిసిఆర్ పరీక్షలు కూడా ఇక్కడే అందుబాటులో ఉన్నాయన్నారు. ఎట్టకేలకూ ఏడు సీట్లు పెంచుతూ అనుమతి ఇవ్వడంతో మంత్రి విడుదల రజినికి, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, వైద్య విద్య సంచాలకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైక్రో బయాలజీ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్లు ఆర్.హైమావతి, వేముల సరోజ, మీనిగ శైలజ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు చంద్రశేఖర్, బసిరెడ్డి ప్రవీణ, ప్రియాంక, రత్న హారిక, ట్యూటర్లు సునీల్‌కుమార్, ఆదిరెడ్డి పరదేశీనాయుడు, సీనియర్ రెసిడెంట్లు లలిత భవాని, దివ్య, పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్లు ఎల్లం నాయుడు, డైసీ, అభినయ, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఆరేపల్లి శ్రీదేవికి బొకే అందజేస్తున్న మైక్రో బయాలజీ సిబ్బంది

సర్పంచిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

మండల సభలో ఏకగ్రీవ తీర్మానం - టెన్త్ విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని సిద్ధరాచెర్ల సర్పంచి రామాంజినేయులుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మండల సభలో పలువురు సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా సర్పంచిపై దాడిని తీవ్రంగా పరిగణించకపోతే ప్రజాప్రతినిధులు ప్రజల్లో తిరగలేరని జడ్పీటీసీ నగరత్నమ్మ అన్నారు. దీంతో వెంటనే దాడికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రతిజాప్రతినిధులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అలాగే పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంఇఒ కృష్ణయ్య నాడు-నేడు పనుల పురోగతిపై వివరించారు. వ్యవసాయ అధికారి ముస్తఫా మాట్లాడుతూ మండలంలో 12500 హెక్టార్లలో పంటలు సాగు చేశారన్నారు. త్వరనే మండలవ్యాప్తంగా సబ్సిడీ విత్తన కాయలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే పంటలు నష్టపోయిన రైతుల వివరాలను ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఎంపిటిసి శంకర్ మాట్లాడుతూ ఎరువుల దుకాణాల్లో ధరల పట్టికలు ఏర్పాట్లు చేయించాలి కోరారు. ఉద్యానవన అధికారిణి ఫజులున్నీసా మాట్లాడుతూ డ్రిప్పులు, స్పికర్లు 25 వేల హెక్టార్లకు మంజూరైనట్లు తెలిపారు. అలాగే వర్షాలకు దెబ్బతిన్న పండ్ల తోటల రైతుల వివరాలను ఉన్నతాధికారులను నివేదించామని వివరించారు. వీరితోపాటు ఆయా శాఖల అధికారులు వారి శాఖల్లో జరిగిన అభివృద్ధి, పురోగతిపై వివరించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ దివాకర్, తహశీల్దార్ నారాయణస్వామి, జడ్పీటీసీ రత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరరావు, ఎంపిటిసిలు రమాదేవి, శారదా, శంకర్, భాగ్యలక్ష్మి, వెంకటనారాయణమ్మ, ఎంఇఒ కృష్ణయ్య, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

మండల మీట్‌లో మాట్లాడుతున్న సభ్యులు

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

నివారణ దినోత్సవంలో వైద్యులు

ప్రజాశక్తి-ఉరవకొండ

డెంగీ వ్యాధితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉరవకొండ, రాకెట్ల, కౌకుంట్ల, విడపనకల్, పెద్ద కొట్టాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రుల ఆధ్వర్యంలో మంగళవారం ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ డెంగీ వ్యాధి దోమల ద్వారా సంక్రమిస్తుందన్నారు. కావున దోమల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆకస్మికంగా తీవ్రమైన జ్వరం, తలనొప్పి, విపరీతమైన కండరాలు, కీళ్లు, కాళ్లనొప్పులు, కంటి కదలిక తగ్గటం, నొప్పి, ఒక్కొక్కసారి శరీరంలో ఎర్రటి దద్దుర్లు, చిగుళ్ల నుంచి రక్తస్రావం, అధిక దాహం, నోరు ఎండిపోవడం వంటివి డెంగీ వ్యాధి లక్షణాలు అన్నారు. ఆయా లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు హరినాథ్‌రెడ్డి, శ్రీధర్, వెంకటేష్‌నాయక్, వినికేథ్, ఎ.పావని, వినిత, సిహెచ్ఒ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ, సబ్ యూనిట్ ఆఫీసర్ లక్ష్మీనాయక్, ఆరోగ్య కార్యకర్తలు నిమ్మల వెంకటేష్, రాఘవేంద్ర, హెల్త్ ప్రొవైడర్లు ఆనంద్‌నాయక్, మమత, నూర్, శ్రావణి, సుభాషిణి, అర్చన, సుమలత, లక్ష్మీ, మాలశ్రీ, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఉరవకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ఆత్మకూరులోలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

పెద్దపప్పూరు : డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యులు కళ్యాణ్‌కుమార్, ఉషారాణి ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డెంగీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జ్వరం వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన చికిత్సను వివరించారు.

గార్లదిన్నె : డెంగీ వ్యాధిపై ప్రజల అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి గౌతమి సూచించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంతోపాటు సచివాలయాల పరిధిలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డెంగీ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హనీషా, సిహెచ్ఒ లోకానాత్, పిహెచ్ఎన్ నాగమ్మ, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి-నార్పల

ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల పరిధిలోని వెంకటాంపల్లి గ్రామంలో దెబ్బతిన్న అరటి తోటలు, డ్రిప్పులు, పైపులను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను ఏమాత్రం పట్టించుకోవడంలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అకాల వర్షాలతో పంటలు దెబ్బతింటే కనీసం రైతులను పరామర్శించిన పాపానపోలేదన్నారు. సిఎం కేవలం బటన్‌లు నొక్కడమే తప్ప చేసేదేమీ లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని దెబ్బతిన్న రైతులను ఆదుకోకపోతే త్వరలోనే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

దెబ్బతిన్న అరటిపంటను పరిశీలిస్తున్న సిపిఐ నాయకులు

స్వచ్ఛ అభియాన్‌పై అవగాహన ఫారెస్టు అధికారులు

స్వచ్ఛ అభియాన్‌పై అవగాహన

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని మడ్డిపల్లి సచివాలయంలో ఫారెస్ట్ రేంజ్ గుత్తి స్పెషల్ ఆఫీసర్ జగన్నాథ్ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛ అభియాన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫారెస్టు ఆఫీసర్ మాట్లాడుతూ మనమందరం నీటిని పొదుపు చేయాలి, ప్లాస్టిక్ నిషేధించాలి, మొక్కలు నాటడంతోపాటు తప్పనిసరిగా పెంచేందుకు బాధ్యత తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ ఇళ్ల పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు బీటీ ఆఫీసర్ వెంకటరమణ, గయాజ్, సర్పంచి రాజేశ్వరి, ప్రభాకర్‌రెడ్డి, మడ్డిపల్లె ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

రాణిసత్రం టోల్‌గేట్ వేలం ప్రకటన

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయ ఆవరణలో ఈనెల 17న స్థానిక రాణిసత్రం టోల్‌గేట్ వేలంపాట నిర్వహించనున్నట్లు దేవాలయ శాఖ సమూహ ఆలయాల కార్యనిర్వహణాధికారి కె.నరసింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాణిసత్రం ఆవరణలో నిలిపి ఉంచు వాహనాల నుంచి పన్ను వసూలు చేసుకునేందుకు హక్కు కోసం వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.లక్ష ధరావతు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-యాడికి

జవహర్ నవోదయ విద్యాలయంలో 2023-24 సంవత్సరానికి ఇంటర్‌లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 2022-23 విద్యా సంవత్సరంలో జిల్లాలో గుర్తించిన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించి ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం, పట్టణ ప్రాంత విద్యార్థులకు 25 శాతం, బాలికలకు 33 శాతం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు రిజర్వేషన్ వర్తింపు ఉందన్నారు. ఈనెల 31వతేదీలోగా దరఖాస్తులను పంపాలని కోరారు.

వృద్ధాశ్రమాల్లో అన్నదానం

ప్రజాశక్తి-యాడికి

నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జెసి అస్మిత్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని జెసి ఫ్యామిలీ అభిమాని గండికోట లక్ష్మణ్ మిత్ర బృందం ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధాశ్రమాల్లో అన్నదానం చేశారు. మండల కేంద్రంలోని కోనరోడ్డులో ఉన్న చవ్వా అశ్వర్థమ్మ, రాయలచెరువులోని లీలావతి వృద్ధాశ్రమాల్లో కేక్ కోసి పంచిపెట్టారు. అనంతరం మాంసాహార విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెసి అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు సహకారంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ప్రజలు సహయ, సహకారాలతో అనంత రూరల్ మండలం రుద్రంపేట గ్రామ పంచాయతీని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నామని సర్పంచి సుగాలి పద్మావతి, ఆదినారాయణ నాయక్ తెలిపారు. ఈమేరకు పంచాయతీ పరిధిలోని రుద్రంపేటలో చేపట్టిన డ్రెయినేజీ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుద్రంపేటలోని వీధుల్లో డ్రెయినేజీ కాలువలు లేక ప్రజలు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన వెంటనే నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.

డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న సర్పంచి సుగాలి పద్మావతి, ఆదినారాయణ నాయక్

నేడు ఎమ్మెల్యే పర్యటన

పుట్లూరు : మండలంలోని సూరేపల్లి, గొల్లపల్లి గ్రామలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి బుధవారం పర్యటించనున్నట్లు ఎంపిడిఒ యోగానందరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో నిర్వహించనున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం పథకాల వివరాలను అడిగి తెలుసుకోనున్నట్లు తెలిపారు. కావున మండలంలోని ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

సబ్సిడీ విత్తనకాయల కోసం దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

సబ్సిడీ విత్తన వేరుశన కాయల కోసం మండలంలోని 15 ఆర్‌బికెల పరిధిలో ఉన్న రైతులు ఆయా ఆర్‌బికెల్లో దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారి అహ్మద్‌బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనకాయలు అవసరమైన వారు రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకుబుక్కులు తీసుకొచ్చి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో బుధవారం నుంచి విత్తన వేరుశనగ నమోదు ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు మండల వ్యవసాయ అధికారి మహేంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేరుశనగ క్వింటా రూ.9,300 కాగా సబ్సిడీ పోను రైతు రూ.5,580 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంకర టిప్పర్ల పట్టివేత

బొమ్మనహాల్ : మండలంలోని నేమక్కల్లు గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న క్వారీ మిషన్ల నుంచి అక్రమంగా బళ్లారికి కంకర తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ అనుమతులు లేకుండా బళ్లారికి కంకర తరలిస్తే చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతులు పొంది జీఎస్టీ కట్టిన తర్వాతే కంకరను తరలించాలని సూచించారు.

పోలీస్‌స్టేషన్‌లో ఉన్న టిప్పర్లు

ఆర్మీ మాజీ ఉద్యోగి ఆత్మహత్య

కనగానపల్లి : మండలంలోని కుర్లపల్లికి చెందిన మాజీ ఆర్మీ ఉద్యోగి ఎం.సూర్యనారాయణ (48) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుర్లపల్లి నుండి చంద్రచర్ల వెళ్లే దారిలో విషపుగుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సూర్యనారాయణ రెండు సంవత్సరాల క్రితం ఆర్మీలో రిటైడ్ అయ్యి స్వగ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎం.సూర్యనారాయణకు ఇటీవల ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. వాటిని భరించలేక మంగళవారం ఉదయం ఆత్మహత్య చేసుకుంటున్నట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య ఆదినారాయణమ్మ, ఇద్దరు కుమారులు,కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.